

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### తల్లి లేని పిల్ల

**"వదిన వాళ్ళమ్మ** అడిగితే పిల్లని ఇవ్వనన్నావట?" యమున తల్లిని అడిగింది.

"అవును. అది మన పిల్ల. మనమే పెంచాలికాని వాళ్ళకివ్వటం ఏమిటి?" సుశీలమ్మ బాధగా చెప్పింది.

"మనం అనకు. నా వల్లకాదు. ఉన్న ఒక్కడితోనే వేగలేక పోతున్నాను. ఐనా అమ్మా! చాదస్తంమాని ఆలోచించు. నిజం నిష్టూరంగా ఉన్నా శీనన్నాయ్ ఇంకో పెళ్ళి చేసుకుంటాడు. ఆ వచ్చే పిల్ల దీన్నెలా చూస్తుందో? వాళ్ళ అమ్మమ్మ దగ్గరైతే హాయిగా పెరుగుతుంది. ఆవిడ కొడుక్కి పిల్లలు లేరు కాబట్టి స్వంత కూతురులా చూసుకుంటాం అని ఆ అమ్మాయి కూడా చెప్పింది."

"ఆవిడ వల్లేం అవుతుంది? వీడు రెండో పెళ్ళి చేసుకుంటే పిల్లని నేనే పెంచుతాను, ఆవిడ దగ్గర పెరిగితే తల్లి తామసమే దీనికీ వస్తుంది. నిక్షేపంలాంటి కాపురాన్ని కాలదన్నుకుంది. కనీసం ఆ సమయంలో పిల్ల మొహమైనా గుర్తు రాలేదేమో పాపిష్టిదానికి. "సుశీలమ్మ దుఃఖంగా ఆగిపోయింది.

పోయినవాళ్ళని అనడం ఎందుకమ్మ అదో పాపం. ఐనా పాతికేళ్ళ వయసులో మూడునెలల పసికందుని వదిలి ఆత్మహత్య చేసుకుందంటే నీ కొడుకు తప్పుకూడా ఉండుంటుంది. ఆవిడ వల్లేం అవుతుంది అంటున్నావు. నీ వల్లేకాదు. ఆవిడ నీకన్నా పదేళ్ళు చిన్నది. ఈ పిల్లలో కూతుర్ని చూసుకుంటుంది. పంపించు."

"లేదు. లేదు. ఇవ్వను. వాళ్ళకి డబ్బులేదు" సుశీలమ్మ తిరస్కరించింది.

"నీకుందిగా? నెలకింతని పంపు. లేదా శీను పంపిస్తాడు. పెంచుతారు. నువ్వీ వయసులో ఈ లంపటాలు పెట్టుకోకు" యమున విసుగ్గా చెప్పింది.

"ఏ ఇంటి మొక్క ఆ పెరట్లోనే పెరగాలి. నేను పిల్లని పంపనుకాక పంపను" సుశీలమ్మ ధృఢంగా చెప్పింది.

"అమ్మా!" నాలుగేళ్ళ నకుల్ ఏడుస్తూ ఇంట్లోకి వచ్చాడు. వాడి తలలోంచి రక్తం నుదుటిమీదకి కారుతోంది.

"అమ్మో! ఏంటిది? ఎక్కడ తగిలిందిరా దెబ్బ?" యమున ఆందోళనగా కొడుకు దగ్గరికి వెళ్ళి, వాడి తలని పరిశీలించింది.

"దివ్య రాయి పెట్టి కొట్టిందే" వాడు వెక్కిళ్ళు మధ్య చెప్పాడు.

"ఏదది? ఎక్కడుంది? మరీ రౌడీదైపోయింది" యమున ఆవేశంగా బయటకి వెళ్ళి మేనకోడలు చెయ్యిపట్టుకుని బరబరా ఈడ్చుకొచ్చింది.

"అమ్మా! చూసావా నీ ముద్దుల మనవరాలు మా వాడి తలబద్దలు కొట్టింది. రాక్షసి పిల్ల. ఎలా ఇకిలిస్తుందో చూడు" తల్లితో కోపంగా చెప్పింది.

"వాడేం చేస్తే అది కొట్టిందో అడిగావా?" సుశీలమ్మ మనవరాలి బట్టలు మడతపెడుతూ అడిగింది.

యమున కోపం తారాస్థాయికి చేరింది.

"అమ్మా! నీది మరీ ధృతరాష్ట్ర ప్రేమైపోయింది. అది నీ కొడుకు కూతురైతే, వీడు నీ కూతురి కొడుకు. దానిమీద అంత పక్షపాతం చూపిస్తావేంటి? వాడేం చేసాడో నీ ముద్దుల మనవరాలినే అడుగు. వాడేం ఘోరం చేస్తే బుర్ర బద్దలు కొట్టిందో చెప్పమను. అసలు అలా చేయడం తప్పని చెప్పవే?" యమున అరిచింది.

"అబ్బ వదిలెయ్‌వే. తల్లిలేని పిల్ల. దాన్ని ఏడిపించకు" సుశీలమ్మ మనవరాల్ని దగ్గరకి లాక్కుని నుదిటిమీది జుట్టుని పైకినెడుతూ చెప్పింది.

"బావని కొట్టావా? తప్పుకదూ? ఇంకోసారి అలాచేసావనుకో అత్త నిన్ను కొడుతుంది."

"అత్త కొడుతుందా? అంటే నువ్వేం అనవనన్మాట. అసలు ఈ ఊరొచ్చాను చూడు. నా చెప్పుతో నేను కొట్టుకోవాలి. ఈ వారంనించి చూస్తున్నాను. నువ్వు నకుల్‌ని దగ్గరకి తీసావా? వాడికోసం ఏదైనా పిండివంట వండావా? దానిమీద చూపించే ప్రేమలో వందోవంతైనా వీడిమీద చూపిస్తున్నావా? నకుల్ పద నాన్నా వెళ్ళిపోదాం. ఈ కొంపలో ఒక్క క్షణం కూడా ఉండద్దు."

యమున ఆవేశంగా తనబట్టలు, కొడుకు బట్టలు సర్దివాడి గాయం పరిశీలించి కడిగి పౌడర్ వేసి తల్లికి వెళ్తున్నానని చెప్పకుండానే ఆటో ఎక్కేసింది.

ఆమె మనసంతా బాధగా ఉంది. దివ్య తల్లికి ప్రాణలింగమైపోయింది. అది ఆడింది ఆట, పాడింది పాట. నకుల్ 'అమ్మమ్మా' అని దగ్గరకి వస్తే భయంగా రెండు నిమిషాలు ఒళ్ళో కూర్చోపెట్టుకుని, 'దివ్య చూస్తే ఏడుస్తుంది నాన్నా అమ్మ దగ్గరకి పో' అని పంపేసింది. తను వచ్చేప్పుడు వాడికెన్ని మాటలు చెప్పింది? అమ్మమ్మ వాడిని ఎత్తుకుని ముద్దులాడుతుంది. బోలెడు స్వీట్స్ చేయిస్తుంది. రాత్రిళ్ళు పక్కన పడుకోపెట్టుకుని కథలు చెప్తుంది. ఇలా ఎన్నో ఆశలు పెట్టింది. తీరా చూస్తే అంతా విపక్షే. అది కూర్చునే కుర్చీలో ఎవరూ కూర్చోకూడదు. దాని పళ్ళెంలో అదే తినాలి. సుశీలమ్మ అన్నం కలిపి దానికే నోట్లో పెట్టాలి. నకుల్ ఆ అని నోరు తెరిస్తే ఓసారి పెట్టబోయింది. రాక్షసి పిల్ల 'వా' అని నోరు తెరిచి రెండు గంటలు ఏడ్చింది. దాంతో నకుల్ భయపడి తల్లి పక్కన కూర్చుని స్వంతంగా అన్నం తినేసాడు.

యమునకి పెళ్ళయి ఆరేళ్ళయినా పుట్టిల్లు పరాయిది అన్న భావన రాలేదు ఎప్పుడూ. కానీ ఈసారి మాత్రం తను ఆ ఇంట్లో పరాయి మనిషి అని బలంగా అనిపించింది.

"అదేంటి? ఇంకో పదిరోజులు ఉంటానన్నావుగా?" తలుపు తెరిచిన యమున భర్త ఆశ్చర్యంగా అడిగాడు.

"పదిరోజులు ఏదైనా చెట్టుకింద కూర్చుని పదకొండోరోజు రమ్మంటారా?" అరిచింది.

ఆమె కోపంగా ఉందని గ్రహించిన అతను మారుమాట్లాడకుండా సూట్‌కేస్ అందుకుని లోపలికి వెళ్ళాడు.

"అమ్మ నన్నెంతో ప్రేమగా చూసేది మనో. మా ఇంట్లో నేనే చిన్నదాన్నిగా. ఎంతో గారాబంగా పెరిగా. నాన్న పోయాక అమ్మ ఇంకా ప్రేమగా చూసింది. ఆ లోటు తెలీకూడదని. ఇప్పుడు మా అమ్మకి నా మీద ప్రేమ చచ్చిపోయింది. అంతా ఆ రాక్షసే. దానిమీదే ప్రేమ. అదే ప్రాణం. నకుల్ పుట్టినప్పుడు ఎంత ముద్దు చేసేది? పులిగోరు గొలుసు తెచ్చి యువరాజులా ఉన్నాడు నా మనవడు అని ఎంత మురిసిపోయింది? వాడి చిలిపి చేష్టలు చెప్పించుకోడానికి రెండుపూట్లా ఫోన్ చేసేది. అలాంటిది వాడు కనీసం పక్కన కూర్చున్నా భయపడిపోతోంది. ఏదో తప్పుచేసినట్లు భయంగా ముద్దులాడుతోంది. నాగురించే పట్టించుకోలేదు. నాకు పంచదార అరిసెలు ఇష్టం అని తెలుసుకదా? దానికోసం బెల్లం అరిసెలే చేయించింది. నాకెందుకో నాకు పుట్టిల్లు లేదనిపిస్తోంది."

యమున ఆ రాత్రి భర్తతో కన్నీళ్ళతో చెప్పింది.

"నువ్వు దివ్యని చూసి ఈర్ష్య పడుతున్నావా యమునా?" మనోహర్ మృదువుగా అడిగాడు.

"ఛీఛీ! ఆ పిశాచప్పిల్లని చూసి ఈర్ష్యా? కోపం. మా అమ్మని నానించి దూరం చేసింది. శీను తను తీసుకెళ్ళి పెంచుతానని చెప్పినా ఇవ్వలేదు. వాడికింకో కొడుకు పుట్టినా పెద్దగా పట్టించుకోదు. అది కొత్తకోడలికి కష్టంగా వుండి మొన్న అడిగింది. 'దివ్యలానే కదండీ వీడు కూడా. మీ అమ్మ వీడిని దగ్గరకి తీయరు. దివ్య వాళ్ళ అమ్మతో బాగా అనుబంధం ఉందా ఆవిడకి' అని.

"నా మొహం ఇద్దరూ ఉప్పు, నిప్పు" అని చెప్పాను.

"మరి ఇదేమిటి?' అని ఆ అమ్మాయి ఆశ్చర్యపోయింది.

వాళ్ళ అమ్మమ్మ, మేనమామ పదిరోజులు ఉంచుకుంటాం అంటే పంపదు. ఊళ్ళోనే కదా పంపచ్చుగా. వాళ్ళు పట్టించుకోవడం మానేసారు. అందరితో శత్రుత్వం పెంచుకుని ఈవిడ ఏం చేస్తుంది?" యమున ఆవేదనగా చెప్పింది.

"పెంచిన మమకారం ఉంటుందిగా యమునా. పెద్దావిడ. వదిలెయ్" మనోహర్ ఓదార్చాడు.

"అమ్మా! బాత్‌రూంలో కాలు జారిపడ్డాను. కుడికాలు ఫ్రాక్చరైంది. మంచం మీంచి లేవలేకపోతున్నాను. నువ్వో పదిరోజులు ఉండి వెళ్తావా?" యమున తల్లికి ఫోన్ చేసి నీరసంగా అడిగింది.

"అయ్యో! అలా ఎలా పడ్డావే? నేనిప్పుడు ఉన్న పళాన ఎలా వచ్చేది? దివ్యకి పదోక్లాస్ పరీక్షలు వస్తున్నాయి. వదిలిపెట్టి రాలేను తల్లి" సుశీలమ్మ చెప్పింది.

"అమ్మా! పది పరీక్షలు మార్చిలో. ఇవ్వాళ ఫిబ్రవరి ఫస్ట్. పదిరోజులు ఉండి వెళ్ళమ్మా" యమున అర్థించింది.

"ఆ ఈడు పిల్లని ఎక్కడ ఉంచి వస్తానమ్మా? మీ అత్తగారిని పిలు. "

"వాళ్ళ అమ్మమ్మ ఇంట్లో ఉండచ్చు కదా పదిరోజులు? ఉన్న ఊళ్ళోనే కదా?" యమున కోపంగా అడిగింది.

"వాళ్ళ వంటలు, పద్ధతులు దివ్యకి నచ్చవు. మీ అత్తగారిని రమ్మను ఈసారికి" సుశీలమ్మ చెప్పింది.

"ఈసారికా? అంటే రెండో కాలు విరగ్గొట్టుకున్నప్పుడు నువ్వు వస్తావన్నమాట" ఉక్రోషంగా ఫోన్ పెట్టేసింది.

దివ్య పరీక్షలు అయిపోగానే మనవరాలిని వెంటపెట్టుకుని యమున ఇంటికి వచ్చింది.

"నా రెండో కాలు విరగలేదమ్మా. అప్పుడే వచ్చావే? లేదా ఈ సెలవల్లోనే విరగ్గొట్టుకోవాలా?" యమున కోపంగా అడిగింది.

సుశీలమ్మ గలగలా నవ్వేసింది.

"నీకు మొదట్నించీ ఆవేశమేనే. నీకంటే బోలెడు బలగం ఉన్నారు. చేస్తారు. దీనికెవరున్నారు చెప్పు. 'తల్లి లేని పిల్ల!' కడుపులో పెట్టి చూసుకోవాలి. లేదా అంతా నన్నే అంటారు. నాయనమ్మ పరీక్షల నాటికి హైదరాబాద్ పోయింది, కూతురి దగ్గరకి. పిల్లని పట్టించుకోలేదని. ఇంతకీ నీ కాలెలా ఉంది?" పరామర్శించింది.

"అత్తా బావెక్కడ?" దివ్య కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అడిగింది.

"వాడు ఐ.ఐ.టి కోచింగ్‌కి వెళ్ళాడు. రాత్రి ఎనిమిది దాకా రాడు. ఐనా చిన్నపిల్లలు, దాదాపు ఒకే వయసు వాళ్ళు. ఈ బావా మరదళ్ళ వరస వద్దు నకుల్ అని పిలు చాలు" యమున కటువుగా చెప్పింది.

"అమ్మే అలా అనాలని నేర్పించింది. సరే. నకుల్ అంటాలే" దివ్య మెలికలు తిరుగుతూ చెప్పింది.

"అమ్మేంటి? నాయనమ్మ అను"

"లేదత్తా.. నాకు అమ్మ అంటేనే ఇష్టం. అలాగే పిలుస్తా. ఎవరికైనా చెప్పేప్పుడు మా నాయనమ్మ అంటాను."

"ఉద్ధరించావుగాని సెలవల్లో మీ నాన్న దగ్గరికి వెళ్ళి నాలుగురోజులు ఉండి రాకూడదూ?"

"అమ్మో అత్తా. అలాంటి మాటలు చెప్పవాకు. ఆవిడగార్ని చూస్తేనే నాకు ఒళ్ళుమంట. నన్నెందుకు పొమ్మంటావు. నేను పోను." దివ్య మెలికలు తిరుగుతూ చెప్పింది.

"ఆవిడ ఏంటి ఆవిడ? మీ అమ్మ ఆవిడే లేదా పిన్ని అని పిలువు. నిన్నేం చేసిందని నీకు ఒళ్ళుమంట? ముసలమ్మ పెంపకంలో ముసల్దానిలాగే మాట్లాడుతున్నావు. తర్వాత నిన్ను చూసుకోవాల్సింది ఆవిడే వాళ్ళతో మంచిగా ఉండాలి. అంతేకానీ అలా మాట్లాడకూడదు" యమున కోపంగా చెప్పింది.

"నాకు మా నాయనమ్మ చాలు అత్తా. ఎవరూ అక్కర్లేదు. అన్నీ నాయనమ్మే చూసుకుంటుంది" మళ్ళీ కళ్ళు తిప్పింది.

"నా ముందు ఇంకోసారి గుడ్లు తిప్పావంటే చంపుతా. ఏంటా వేషాలు? నాయనమ్మ శాశ్వతంగా ఉంటుందా? తర్వాత ఏంటీ అనే విచక్షణ ఆవిడకేలేదు. నీకేం వస్తుందిలే." యమున విసురుగా వంటగదిలోకి వెళ్ళిపోయింది.

రెండు రోజుల తర్వాత సుశీలమ్మ భయంగా కూతుర్ని అడిగింది.

"అమ్మాయ్! మీరు కాశ్మీర్ వెళ్తున్నారటగా?"

"అవునమ్మా నీకింకా చెప్పలేదు కదూ. మేమూ, మా ఆడపడుచువాళ్ళు కలిసి వెళ్తున్నాం. ఇంకో పదిహేను రోజులుందిలే. ఐనా నీకెలా తెలిసింది? యమున ఆశ్చర్యంగా అడిగింది.

నకుల్ దివ్యకి చెప్పాడట. అది నేనూ కాశ్మీర్ వెళ్తానని గోల. నిన్ను అడగాలంటే భయంట. నన్ను చెప్పమంది."

యమున తల్లివైపు కళ్ళార్పకుండా చూసింది.

"అమ్మా! మా చిన్నప్పుడు నువ్వు ఎంత డిగ్నిఫైడ్‌గా ఉండేదానివో గుర్తుందా? అమ్మమ్మని ఏదో అడగమని చెపితే నువ్వేం అన్నావు? 'కన్నతల్లి అయినా సరే గ్రహించి ఇవ్వాలేకానీ నోరు తెరిచి అడగను' అన్నావు. ఈ పిల్లకోసం నువ్వు అభిమానాన్ని వదిలేసావ్. పక్కింటివాళ్ళబ్బాయిని అమెరికానించి లేప్‌టాప్ తెమ్మన్నావుట. టెన్త్ క్లాస్ పిల్లకి అది అంత అవసరమా? శీనన్నాయ్‌ని అడిగితే పంపుతాడుగా? నువ్వు డబ్బు ఇవ్వచ్చుగాక. కాని నోరు తెరిచి ఒకర్ని అడిగేంతగా అది నిన్ను వేధించింది. అది తానా అంటే తందానాగా మారావు" ఆవేదనగా చెప్పింది.

ఆ అరుపులకి గదిలోంచి వచ్చిన దివ్యని చూపిస్తూ క్రోధంగా చెప్పింది. "దీని మూలంగా నువ్వు అడుక్కునే దానిలా తయారయ్యావు. దీని మూలంగా నీ సెల్ఫ్ రెస్పెక్ట్ పోగొట్టుకున్నావు. ఛీ".

ఆ తర్వాత సుశీలమ్మ కాశ్మీర్ మాట ఎత్తలేదు. యమున కూడా ఆ విషయం మాట్లాడలేదు.

తలుపు తెరిచిన యమున ఎదురుగా తల్లిని చూసి ఆశ్చర్యపోయింది. ఈ మధ్యకాలంలో సుశీలమ్మ రావడం బాగా తగ్గింది. యమునకూడా పుట్టింటికి అరుదుగా వెళ్తోంది. కనిపించని తెరలాంటిదేదో తామిద్దరి మధ్య ఉందని ఇద్దరూ గ్రహించాక వారిమధ్య వాదోపవాదాలు కూడా తగ్గిపోయాయి.

సుశీలమ్మ కొద్దిగా ఆయాసపడుతూ లోపలికి వచ్చి సోఫాలో కూలబడింది. యమున గబగబా మంచినీళ్ళు తెచ్చిచ్చి అడిగింది.

"నీ ప్రాణలింగం రాలేదే?"

సుశీలమ్మ కొద్దిగా మంచినీళ్ళు తాగి, గ్లాస్ పక్కనపెట్టి చెప్పింది.

"నీతో కొద్దిగా మాట్లాడాలి యమునా"

"చెప్పమ్మా. ఫోన్‌లో మాట్లాడితే సరిపోయేదిగా? ఇంతదూరం ఈ వయసులో ఒక్కదానివే వచ్చావేంటి? కనీసం ముందుగా చెపితే స్టేషన్‌కి వచ్చేదాన్నిగా" యమున ఆప్యాయంగా చెప్పింది.

"ఇది ముఖాముఖి మాట్లాడుకోవాల్సిన విషయం యమునా. దివ్యని నకుల్‌కి చేసుకుంటావేమో అని అడగడానికి వచ్చాను"

"ఏమిటి?" యమున కళ్ళు పెద్దవి చేసి తల్లివైపు చూస్తూండిపోయింది.

"ఈ మధ్య ఒంట్లో బావుండటంలేదు యమునా. ఏ నిమిషానికి ఏమవుతుందో తెలీదు. ఈలోగా దివ్య పెళ్ళి చేయాలని. మేనత్తవి. నువ్వయితే దాన్ని కడుపులో పెట్టి చూసుకుంటావని."

"సారీ అమ్మా. అసలు ఆ ఆలోచన రానీకు. నకుల్ దాన్ని చేసుకోడు. చేసుకుంటానన్నా నేను ఒప్పుకోను"

"దానికేం తక్కువ? అదీ ఇంజనీరింగ్ చదివింది. పని, పాట వచ్చు. బుద్ధిమంతురాలు. తల్లి లేని పిల్ల. నువ్వయితే..."

"అందుకే ఆ కారణానికే చేసుకోను" యమున ఉగ్రంగా చెప్పింది.

"నీ కొడుక్కి మర్యాదలు, పెట్టుపోతలు జరగవనా?" సుశీలమం నవ్వుతు అడిగింది.

యమున అదేం పట్టించుకోకుండా ఆవేశంగా చెప్పింది.

"తల్లిలేని పిల్లని దాని బాధ్యత తీసుకున్నావు. కానీ బాధ్యతగా మాత్రమే నువ్వు దాన్ని చూడలేదు. అది నీకు కూతురికంటే ఎక్కువైంది. వాళ్ళనాన్న అడిగినా నువ్వు దాన్ని పంపలేదు. మేనమామ ఇంటికి ఓ పూట కూడా వెళ్ళిరమ్మనలేదు. మూర్ఖంగా దానిమీద అతిప్రేమ పెంచుకున్నావ్. నాకు కాలు విరిగినప్పుడు రాలేదు. హిస్టరెక్టమీ అయినప్పుడూ రాలేదు. 'మీ అత్తగార్ని పిలుచుకో' అని సింపుల్‌గా అనేసావు. ఆ సమయంలో తల్లి పక్కనుంటే కలిగే సాంత్వన అత్తగారుంటే కలుగుతుందా అమ్మా? మంచం మీదున్న నేను ఆవిడని రెండోసారి కాఫీ కూడా అడగలేకపోయాను. రోజూ నేను ఫోన్ చేయడమే కానీ నువ్వు చేయవు. నేను చేసినప్పుడే దానికి ఏదో గుర్తొస్తుంది. నువ్వు 'వస్తున్నా తల్లి అత్తతో మాట్లాడుతున్నా' అని చెప్పి నాతో 'ఇంకేమైనా విశేషాలున్నాయా?' అని అడుగుతావు. ఎన్నోసార్లు ఫోన్ చేయకూడదు అనుకుంటా. కానీ ఊరుకోలేను" యమున దుఃఖంగా తల్లి కాళ్ళ దగ్గర కూర్చుని ఆవిడ ఒళ్ళో తలపెట్టి చెప్పింది.

"ఆ దివ్య దొంగ. నానించి నా తల్లిని దొంగిలించింది. నా తల్లికి నామీదున్న అమ్మతనాన్ని దొంగతనం చేసింది. దొంగనెవరైనా ఇంట్లో పెట్టుకుంటారా? అది కాదమ్మా తల్లిలేని పిల్ల. వాళ్ళమ్మ ఎప్పుడు ఆత్మహత్య చేసుకుందో ఆ రోజునించి నేను, శీను ఇద్దరం తల్లిలేని పిల్లలమయ్యాం"

యమున ఏడుపు హృదయవిదారకంగా ఉంది. సుశీలమ్మ అచేతనంగా చూస్తూండిపోయింది.

*(ప్రపంచంలో అన్నిటికన్నా విలువైన అమ్మ ప్రేమని కోల్పోతే కలిగే బాధని సరిగ్గా వివరించానో లేదో కానీ ఇది నా కథే)*

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments